



అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 27, జూలై 2026 పేజీలు : 04

## 16 ఏళ్ల పాపకు గర్భం చేసిన....
# 40 ఏళ్ల మానవ మృగం

❖ స్టూడెంట్ కు గర్భం ....ఫోక్సో చట్టం కేసు..!! ❖ మైనర్ అమ్మాయి ని గర్భం చేసిన బాబు పై కేసు నమోదు.
❖ గర్భం చేసిన వ్యక్తి కి...ఇద్దరు భార్యలు ఇద్దరు పిల్లలు.
❖ హిందూపురంలో చికిత్సల అనంతరం గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.
❖ విష్మయాన్ని కలిగిస్తున్న ఘటన... ❖ బాలికకు న్యాయం జరిగేది ఎలా.



**గోరంట్ల జులై 26 ప్రభాత వార్త**
పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలిక గర్భం దాల్చిన ఘటన గోరంట మండలంలో ఒక్కసారిగా చర్చనియంసంగా మారింది.

గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దళిత విద్యార్థి గర్భం దాల్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత బాలిక తల్లిదండ్రులు ఈ సంఘటనపై గోరంట్ల పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు బాబు అనే వ్యక్తిపై గోరంట్ల పోలీసులు ఫోక్సు చట్టం కింద కేసు నమోదు చేశారు.

వివరాల్లోకెళితే...

గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దళిత కుటుంబంలోని ఓ మైనర్ బాలిక ను అదే గ్రామానికి చెందిన ఇద్దరు భార్యలు ఇద్దరు పిల్లలు ఉన్నారని అలాంటి వ్యక్తి ఆ మైనర్ బాలిక గర్భవతి కావడానికి కారణంగా తెలుస్తోంది. అయితే బాధిత విద్యార్థి తల్లిదండ్రులు ఆ విద్యార్థిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం గర్భవతిని నిర్ధారించుకున్న తర్వాతనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

### తుంగభద్ర జలాశయంలో
# 31.183 టీఎంసీలకు చేరిన నీటిమట్టం..!

-ఆశలు రేకెత్తిస్తున్న డ్యాం పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు -గత ఏడాది జూలై 10న టీబీ నుంచి హెచ్ఎల్సీకు నీటి విడుదల



**ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త**
కర్నాటకలోని తుంగభద్ర జలాశయంలో ఆదివారం ఉదయం నాటిని నీటి మట్టం 31.183 టీఎంసీలకు (1,606.50 అడుగులు) చేరింది. డ్యాంలోకి గత నాలుగు రోజులుగా ఇన్ఫ్లో పెరుగగా ప్రస్తుతం 12,869 క్యూసెక్కుల ఇన్ఫ్లో కొనసాగుతోంది. డ్యాం పూర్తి నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు (1,633 అడుగులు) కాగా గత ఏడాది ఇదే సమయానికి డ్యాంలో 77.907 టీఎంసీల నీరు నిల్వ ఉంటేదని డ్యాం అధికారులు తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు డ్యాంలో కేవలం 9.725 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండి డ్యాంలోకి కేవలం 4,188 క్యూసెక్కుల ఇన్ఫ్లో మాత్రమే కొనసాగుతూ వచ్చింది. ఆపై డ్యాం ఎగువ పరివాహక ప్రాంతాలైన శివమొగ్గ, అగుంబె, తీర్థహళ్లి, సాగర, కదూరు, హొసనగర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో 8వ తేదీ నుండి ఇన్ఫ్లో ఒక్కసారిగి 17,507 క్యూసెక్కులకు పెరిగి 11వ తేదీ నాటికి గరిష్టంగా 38,977 క్యూసెక్కులకు చేరగా నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. ఆపై 12వ తేదీ నుంచి క్రమేనా ఇన్ఫ్లో తగ్గుతూ రాగా 22వ తేదీ నుంచి ఇన్ఫ్లో మళ్లీ పెరిగింది. కాగా గత ఏడాది జూలై 10వ తేదీన తుంగభద్ర జలాశయం నుండి హెచ్ఎల్సీ కాలువకు నీటి విడుదల జరుగగా డ్యాంలో నీటి నిలువ తక్కువగా ఉన్నందుకు ఈ ఏడాది కాలువకు ఎప్పటి నుంచి నీటిని విడుదల చేస్తారన్న విషయమై స్పష్టత కరువైంది. కాలువకు నీటిని విడుదల చేసినా తాగునీటి అవసరాలకే అధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయకట్టుకు నీరు అందించే పరిస్థితి లేదని తెలుస్తోంది. అయితే రైతులు మాత్రం కాలువకు ఎప్పుడు నీళ్ల వదులుతారోరని పంటలు పెట్టుకోవడానికి భూములను సిద్ధం చేసుకొని ఎదురు చూస్తున్నారు. హెచ్ఎల్సీ కాలువ ద్వారా అనంతపురం జిల్లాలోని దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందడం ఈ ఏడాది గగణమేనని తెలుస్తోంది.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల ఎదురుచూపులు..!

అడుగంటిన భూగర్భ జలంతో ఎండుతున్న తోటలు


ఎండిపోతున్న తోటలు

**అమరాపురం జూలై 26 ప్రభాతవార్త**
మడకశిర నియోజకవర్గంలో 5 మండలాల్లో వర్షాలు లేక భూగర్భజలం అడుగంటిపోయి రైతుల బోర్లలో నీరు రాక అరకొర నీటితో రైతులు సాగుచేసిన పంటలు ఒక పక్క ఎండిపోతుంటే, ఉన్న పంటలను రక్షించుకోవడానికి లక్షలాది రూపాయలు అప్పులు చేసి బోర్లు వేసిన లో వోల్టేజ్ సమస్య కారణంగా ట్రాన్స్ఫార్మర్ల కోసం ఎదురుచూసే పరిస్థితులు నెలకొన్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

రైతుల ప్రభుత్వమని రైతుల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రభుత్వ పెద్దలు ప్రకటిస్తుంటే, ఇక్కడ విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలోని మడకశిర అమరాపురం గుడిబండ రోళ్ళ ఆగలి మండలాలకు చెందిన దాదాపు 1200 మంది రైతులు ట్రాన్స్ఫర్మర్ల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూసే పరిస్థితి నెలకొన్నది. వచ్చే అరకొర నీటితోనైనా పంటలు రక్షించుకుందామంటే సమస్య కారణంగా వ్యవసాయ బోర్లలోని మోటర్లు స్టార్టర్లు ప్రతినిత్యం కాలిపోయి వందలాది మంది రైతులు ఆర్థిక వ్యయాన్ని భరించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుతం నియోజకవర్గంలో అత్యధికంగా వేలాది ఎకరాల్లో వక్క, తమలపాకు, ఉద్యానవన పంటలైన దానిమ్మ అరటి జామ తదితర తోటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. కళ్ళు ఎదుటే ఎండిపోయే తోటలను చూసి రైతులు ఆత్మహత్య శరణ్యంగా భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు.భూగర్భ జలం అడుగంటిపోయి ఉన్న బోర్లు ఎండిపోతున్న సందర్భంగా లక్షలాది రూపాయలు వెచ్చించి కొత్తగా బోర్లు వేయించి సర్వీసులు తీసుకున్న లో వోల్టేజ్ సమస్య కారణంగా వచ్చే అరకొర నీటిని కూడా పంటలకు పెట్టుకోలేని దౌర్భాగ్య స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంటల సాగుకు ఖర్చు పెట్టడం తప్ప దాని నుంచి లాభాలు ఆర్జించే స్థాయిలో రైతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని రైతులు ప్రతినిత్యం విద్యుత్ శాఖ అధికారుల కార్యాలయం చుట్టూ ట్రాన్స్ఫార్మర్ల కోసం తిరిగే పరిస్థితి నెలకొన్నది.వర్షాభావం కారణంగా ప్రకృతి వికోకానికి గురియై రైతులు వలసలు వెళ్లడానికి కూడా సిద్ధమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. రైతు బాగుంటే దేశం సుభిక్షంగా ఉంటుందని నానుడినైనా తెలుసుకొని విద్యుత్ ఉన్నతాధికారులు రైతుల సమస్యను పరిష్కారానికి ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రస్తుతం వ్యవసాయం చేయడమే రైతులకు దుర్భరంగా మారింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పచ్చదనాన్ని వెదజల్లే తోటలు లో వోల్టేజ్ సమస్య కారణంగా ఎండిపోతు కాంతి విహీనంగా మారిన తరుణంలో వీటిని రక్షించడానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మడకశిర నియోజకవర్గ రైతులను ఆదుకోవడానికి ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ట్రాన్స్ఫర్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# అందరి సహకారంతో ఐకమత్యంగా కమ్మ భవన్ నిర్మిద్దాం

❖ ఎన్టీఆర్ స్ఫూర్తితో సమాజ సేవలో ముందుండాలి ❖ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కమ్మ సమాజం అండగా నిలవాలి
❖ స్థలదాత రాయల రామన్న దాతృత్వం ఆదర్శనీయం ❖ కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అమిలినేనికి సన్మానం




కాకతీయ కమ్మ సేవా సమితి ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, సంఘం అధ్యక్షులు జ్ఞానభారతి రమేష్‌బాబు.



ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానిస్తున్న కాకతీయ కమ్మ సేవా సమితి ప్రతినిధులు.

**కళ్యాణదుర్గం, జూలై 26 ప్రభాతవార్త:**
కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గం ఐకమత్యంతో ముందుకు సాగి, కమ్మ భవన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. సమాజ అభ్యున్నతి, విద్యా ప్రోత్సాహం, సామాజిక సేవే లక్ష్యంగా ప్రతి కుటుంబం తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన సూచించారు. ఆదివారం కళ్యాణదుర్గం మార్కెట్ యార్డులో కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు జ్ఞానభారతి రమేష్‌బాబు అధ్యక్షత వహించగా, అనిల్ చౌదరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దాదాపు పన్నెండేళ్లుగా కమ్మ సంఘం కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని గుర్తు చేశారు. కమ్మ భవన్ నిర్మాణం కోసం రాయల రామన్న చౌదరి 75 సెంట్ల విలువైన స్థలాన్ని ఉచితంగా విరాళంగా అందించినప్పటికీ, భవన నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. ఆ దాతృత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకొచ్చి కమ్మ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కమ్మ భవన్ కేవలం ఒక భవనం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే సేవా కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన అభిప్రాయపడ్డారు. పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం, పోటీ పరీక్షలకు శిక్షణ, ఉద్యోగ మార్గదర్శకత్వం, వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక సేవలను ఈ వేదిక ద్వారా చేపట్టేలా కార్యాచరణ రూపొందించా లని సూచించారు. కమ్మ సమాజం దేశ విదేశాల్లో వ్యాపార, విద్య, సేవా రంగాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించిం దని, అదే సేవాభావాన్ని స్వగ్రామాల అభివృద్ధికి వినియోగిస్తే సమాజంలో మరింత సానుకూల మార్పు తీసుకు రావచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత విభేదాలను పక్కనపెట్టి భవిష్యత్ అభివృద్ధిపైనే అందరూ దృష్టి సారించాలని కోరారు.ప్రజానాయకుడు, మహానటుడు నందమూరి తారక రామారావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని అన్ని వర్గాల సంక్షేమం కోసం కమ్మ సమాజం సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆయన సూచించారు. రాయల రామన్న అందించిన స్థలానికి అదనంగా మరికొంత స్థలాన్ని సమీకరించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కళ్యాణ మండపంతో కూడిన సమగ్ర కమ్మ భవన్ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర కమ్మ సంఘం కార్యదర్శి వెంకట్రావు మాట్లాడుతూ, రాజకీయాలు వేర్వేరు అయినప్పటికీ సామాజిక సేవ విషయంలో అందరూ ఒక్కటిగా నిలవాలని అన్నారు. సమాజ ప్రయోజనాల కోసం భేదాభిప్రాయాలను పక్కనపెట్టి సమిష్టి కృషితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశ ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి మృతికి సంతాపం ప్రకటించి రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతపురం, ఉరవకొండ కమ్మ సంఘం ప్రతినిధులు కళ్యాణ మండప నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తామని ప్రకటించడం విశేషంగా నిలిచింది. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కాకతీయ కమ్మ సేవా సమితి ప్రతినిధులు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే కమ్మ భవన్ కోసం 75 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందించిన దాత రాయల రామన్న దంపతులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించి వారి దాతృత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాకతీయ కమ్మ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ అమర లింగారెడ్డి, కార్యదర్శి కొత్తపల్లి బాబు, సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, డాక్టర్ రాంబాబు, డాక్టర్ వెంకటేశులు, వివిధ గ్రామాల కమ్మ సంఘం ప్రతినిధులు, మహిళలు, యువత, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన కమ్మ సామాజిక వర్గ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాలల్లో పనిచేయని ఆర్వో వాటర్ ప్లాంట్లు..!

❖ బోరు నీళ్లు తాగుతున్న విద్యార్థులు
❖ మరికొన్నిచోట్ల టీచర్లు నీళ్లు కొని ఇస్తున్న పరిస్థితి
❖ తెలిసినా పట్టించుకొని విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉన్నతాధికారులు





తపోవనం జడ్పీహెచ్ఎస్ లో పనిచేయనే ఆర్వో వాటర్ ప్లాంట్, కొనుగోలు చేసిన నీళ్లు తాగుతున్న విద్యార్థులు




జిల్లా కేంద్రంలో మదర్ థెరిస్సా, ఎన్ వి ఆర్ నగరపాలక ప్రైమరీ స్కూల్లో పనిచేయని ఆర్వో వాటర్ ప్లాంట్లు

**అనంతపురం న్యూటౌన్, జూలై 26 ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, మంచి త్రాగునీరు (మినరల్ వాటర్) అందించడానికి ప్రభుత్వము చర్యలు తీసుకుంది. కానీ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు చాలాచోట్ల పనిచేయక దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో పలుచోట్ల విద్యార్థులు బోరు నీళ్ల తాగుతున్నారు. మరి కొన్నిచోట్ల టీచర్లు తాగు తాగునీరు కొని విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ విషయాలు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం.

అనంతపురం జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు 1752 ఉన్నాయి. అందులో ఒకటో తరగతి నుండి ఇంటర్ వరకు 1,67,434 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులతో పాటు మంచినీరు అందించడానికి లక్షలాది రూపాయలు విలువచేసే ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. కానీ చాలా పాఠశాలల్లో కొన్ని నెలలకే ఆర్వో వాటర్ ప్లాంట్ లు మరమత్తులకు గురయ్యాయి. అందులో జిల్లా కేంద్రం కళ్యాణదుర్గం రోడ్డులో పాపం పేటలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఉంది. కానీ కొన్ని నెలలకే మరమ్మత్తులకు గురైంది. దీంతో పాఠశాల హెచ్ఎం ప్రతిరోజు దాదాపు 20 వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తుంది. అలాగే తపోవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు ఆర్వో వాటర్ ప్లాంట్ లు ఉన్నాయి. అవి కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. దీంతో ఒక టీచరు ప్రతిరోజు నీళ్ల కొనుగోలు చేసి వాటర్ క్యాన్లలో ఉంచడంతో విద్యార్థులు తాగుతున్నారు. అలాగే పాపంపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఉంది. కానీ కొన్ని నెలలుగా పని చేయడం లేదు. అక్కడ కూడా మిగతా 4లో...

# మిస్సింగ్ కేసు 24 గంటల్లోనే చేధింపు

- సిసిటివి 360 ద్వారా ఆచూకీ లభ్యం - కుటుంబ సభ్యులకు అప్పగింత..




మిస్సింగ్ అయిన మహిళ ఆచూకి కనుగొన్న పోలీసులు

**అనంతపురం క్రైమ్ జులై 26 ప్రభాతవార్త**
ఇంటి నుంచి వెళ్ళిపోయి కనిపించకుండా పోయిన ఓ మహిళ ఆచూకీని పోలీసులు, 24 గంటల్లోనే క్షేదించారు. సిసిటివి 360 అప్లికేషన్ సాంకేతికత సహాయంతో కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. పెద్దపప్పూరు ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి సమాచారం మేరకు... పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట గ్రామానికి చెందిన గాలి విజయలక్ష్మి (52) ఈ నెల 24న సాయంత్రం 6:30 గంటల సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయారు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో 25న సాయంత్రం 5:30 గంటలకు పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఖిఉమెన్ మిస్సింగ్ఖి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన సిసిటివి 360 అప్లికేషన్ ద్వారా సదరు మహిళ కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో 25న ఉదయం 8:40 గంటలకు సంచరిస్తున్నట్లు సిసిటివి ఫుటేజీ ద్వారా గుర్తించారు. వెంటనే స్పందించిన పోలీసులు కదిరి వెళ్లి, ఆలయ పరిసర ప్రాంతాల్లో గాలించి ఆమెను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విజయలక్ష్మిని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కేసును చేదించిన పెద్దపప్పూరు పోలీసులను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

# దళిత విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యపు నీడ

❖ పాడుబడిన ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం ❖ ఒకప్పుడు విద్యకు నిలయం... నేడు శిథిల భవనం


పాడుబడిన హాస్టల్ భవనం

**శెట్టూరు:జూలై 26 (ప్రభాత వార్త)**
మండలంలోని ములకలేడు గ్రామంలో 1981లో ప్రారంభమైన ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహం నేడు అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఒకప్పుడు వందలాది మంది నిరుపేద దళిత విద్యార్థులకు ఆశ్రయంగా నిలిచి, వారి ఉన్నత విద్యకు బాటలు వేసిన ఈ వసతి గృహం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని అడవిని తలపించే దుస్థితిలో ఉంది. పగుళ్ల తీసిన గోడలు, వెలిసిపోయిన రంగు, మూసివేసిన తలుపులు, చుట్టూ పెరిగిన ముళ్లపొదలు ఈ భవనం దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఈ హాస్టల్‌లో చదువుకుని నేటి సమాజంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, వ్యాపారవేత్తలుగా స్థిరపడిన అనేక మంది మాజీ విద్యార్థులు ఉన్నారు. అలాంటి చరిత్ర కలిగిన విద్యాలయాన్ని నేటి పరిస్థితుల్లో నిర్లక్ష్యానికి గురిచేయడం స్థానిక ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

### అడవిని తలపిస్తున్న పరిసరాలు

హాస్టల్ చుట్టూ భారీగా ముళ్లపొదలు, కలుపు మొక్కలు పెరిగిపోవడంతో భవనం కనిపించడమే కష్టంగా మారింది. రాత్రి వేళల్లో విషసర్పాలు, తేళ్ల సంచరించే ప్రమాదం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. నిర్వహణ పూర్తిగా లేకపోవడంతో ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే


అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన భోజన శాల.

అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పేద విద్యార్థులకు తీరని నష్టం

దళిత విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, ఇప్పటికే నిర్మించిన ప్రభుత్వ వసతులను సంరక్షించడంలో సంబంధిత శాఖలు విఫలమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ భవనాన్ని మరమ్మతులు చేసి తిరిగి ప్రారంభిస్తే సమీప గ్రామాలకు చెందిన పేద విద్యార్థులకు వసతి సమస్య ... మిగతా 3లో...

# మరణంలోనూ మహోన్నతుడు

ఆరుగురికి ప్రాణదాతగా రమాకాంత్ రెడ్డి


రమాకాంత్‌రెడ్డి ( ఫైల్‌ఫోటో)

**అనంతపురం క్రైమ్ జులై 26 ప్రభాతవార్త**
తన అకాల మరణంలోనూ ఆరుగురికి జీవితాన్నిచ్చాడు రమాకాంత్ రెడ్డి.. తన అవయవాలను దానంగా ఇచ్చిన విజేతయ్యాడు. తన లాగే అవయవాల దానం చేయాలని పలువురికి ఆదర్శంగా నిలిచాడు. జీవించి ఉన్నంతకాలం తన వృత్తిని అంకితభావంతో నిర్వర్తించిన ఓ వ్యక్తి, మరణానంతరం కూడా ఆరుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించి మానవత్వానికి మచ్చు తునకగా నిలిచాడు. వివరాల మేరకు... పెనుకొండ వాసి ఎస్ఆర్. రమాకాంత్ రెడ్డి (50) ఆదివారం బ్రెయిన్‌డెడ్‌తో కన్నుమూశారు. రమాకాంత్ రెడ్డి గతంలో పలు పత్రికా టీవీ ఛానల్లలో కెమెరామెన్‌గా సేవలందించాడు. వివాదరహితుడు, మృదు స్వభావంతో, వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసే వ్యక్తిగా అందరి మన్ననలు పొందారు. తర్వాత ప్రభుత్వ సిరికల్చర్ శాఖలో సిరికల్చర్ టెక్నీషియన్ అసిస్టెంట్‌గా గత 8 ఏళ్లుగా విధులు నిర్వర్తించారు. ఈనెల 20న సాయంత్రం అనంతపురంలోని టీవీ టవర్ సమీపంలో బైక్‌పై వెళ్తుండగా యూటర్న్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. తొలుత నిమ్హాన్స్‌కు తరలించారు. అనంతరం బెంగళూరులోని ఆస్టర్ ఆర్.వి. ఆసుపత్రిలో చేర్పించారు. వారం రోజుల పాటు వైద్యులు తీవ్రంగా చికిత్స అందించినప్పటికీ ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదు. చివరకు ఆదివారం బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో అవయవదానానికి ముందుకు వచ్చారు. కర్ణాటక ప్రభుత్వ ఆరోగ్యశాఖ సమన్వయంతో ఆయన కళ్లు, కిడ్నీలు, గుండె, కాలేయాన్ని దానం చేశారు. దీంతో ఆరుగురు ప్రాణాలకు కొత్త ఆశ, కొత్త జీవితం లభించింది. దుఃఖంలోనూ సమాజానికి మేలు చేయాలనే కుటుంబ సభ్యుల నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. రమాకాంత్ రెడ్డికి భార్య సరస్వతి, డిగ్రీ చదువుతున్న కుమార్తె భావన, 9వ తరగతి చదువుతున్న కుమారుడు విఖ్యాత్ ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆయన అకాల మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పిల్లల చదువుకు పూర్తి సహాయం అందించడంతో పాటు, కారుణ్య నియామకాల కింద ఆయన భార్య సరస్వతికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని జర్నలిస్టులు, సహచర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### పెనుకొండ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు

నేడు ఉదయం 06:00 గంటలకు రమాకాంత్ రెడ్డి గారి పార్థివ దేహం పెనుకొండ నారాయణమ్మ కాలనీలోని ఆయన అన్న శ్రీకాంత్ రెడ్డి నివాసానికి చేరుకోనుంది. పెనుగొండ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించబడనున్నాయి.

# ఫ్రీ మాన్సూన్ డ్రై సోయింగ్

- రైతుకి మేలు అగ్రికల్చర్ ఆఫీసర్ గోపాల్



వ్యవసాయ సలహాలు చెప్తున్న దృశ్యం

**బ్రహ్మసముద్రం జూలై 26 ప్రభాతవార్త**

బ్రహ్మసముద్రం మండలంలోని ముప్పాళకుంట గ్రామం నందు మేకల గంగమ్మ పొలంలో ఫ్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో విత్తనాలు విత్తడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గోపాల్ మరియు కెవికె శాస్త్రవేత్త మల్లికార్జున మాట్లాడుతూ వాతావరణ సూచనల మేరకు ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా నమోదు అవుతాయన్నారు. ఫ్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ అంటే ఐదు ప్రధాన విత్తనాలైన కంది, సజ్జ, ఆముదం, అనుములు, అలసంద వంటి ఐదు రకాల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకొని బంకమట్టి, ఘనజీవామృతం బూడిద కలిపి విత్తుకోవాలన్నారు. బయో డైవర్సిటి కొరకు రాగులు, పెసలు, గోరు చిక్కుడు, ఆవాలు, ధనియాలు, మెంతులు, బెండ విత్తడం జరిగింది. ఈ విధంగా విత్తుకోవడం వల్ల బేట్ట పరిస్థితి తట్టుకొని విత్తనం మొలకెత్తుతన్నారు. రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. 365 రోజులు పంటలతో భూమిని కప్పి విధానం అత్యంత కీలకమైన అంశాలు, దీనివల్ల వర్షాధార భూముల్లో సంవత్సరం పొడవున వివిధ రకాల పంటలను సాగు చేసుకోవచ్చని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో నాచురల్ ఫార్మింగ్ సిబ్బంది సురేష్, మల్లికార్జున, రాధ, సరిత బాయి, లలిత బాయి, జ్యోతి బాయి, రాజశేఖర్, నీల బాయి, స్రవంతి, మరియు రైతులు పాల్గొన్నారు.

# శ్రీ కొంకల్లు లక్ష్మిదేవి దేవాలయ అభివృద్ధికి నూతన కమిటీ ఎంపిక

**గుడిబండ జూలై 26 ప్రభాతవార్త**



నూతన కార్యవర్గం సభ్యులు

మండలంలోని కొంకల్లు గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మిదేవి దేవాలయ అభివృద్ధి కోసం నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. మందలపల్లి, ఎస్.రాయపురం, పూజారిపల్లి, కొంకల్లు గ్రామాలకు చెందిన భక్తుల సూచనల మేరకు నాలుగు గ్రామాల నుంచి సుమారు 20 మందిని కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా మందలపల్లి నరసింహప్ప, ఎస్.మూర్తి, ఎస్.రాయపురం నరసింహప్ప, గోవిందప్ప, కొంకల్లు సిప్రీ హనుమంతరాయప్ప, నరసింహామూర్తి, రమేష్ పూజారిపల్లి కదరప్ప, ఎం నరసప్ప లను ఎంపిక చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్.రాయపురం హనుమంతరాయుడు, ఉపాధ్యక్షులుగా కొంకల్లు సి.ఎన్.నరసింహప్ప, మందలపల్లి గోవిందప్ప, ఎస్.రాయపురం శీనా హనుమంతరాయప్పలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పూజారిపల్లి రాజన్న, సహాయ కార్యదర్శులుగా కొంకల్లు ఎన్.హనుమంతరాయప్ప, ఎస్.రాయపురం భూతరాజు, మందలపల్లి నటరాజులను ఎంపిక చేశారు. కోశాధికారిగా కొంకల్లు హెచ్.శివన్నను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా దేవరాజు, పరమేష్, మల్లేష్, లోకేష్, ఆర్.నరసింహామూర్తి, కుమార్, గుండా, బి.ఎన్.నరసింహామూర్తి, అభిషేక్ నాగరాజు, తిప్పేస్వామి గోవిందరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీ లక్ష్మిదేవి దేవాలయ అభివృద్ధికి గ్రామస్తులు, భక్తులు సహకరించాలని కోరారు. ఆలయ అభివృద్ధి, నిర్వహణకు అందరి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు.

# ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలో విశేష పూజలు

- వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్న భక్తులు

**ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంవద్దగల ఉండబండ వీరభద్ర స్వామి ఆలయంలో స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాడ ద్వాదశి ఆదివారం వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.విజయ్‌కుమార్ పర్య వేక్షణలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రాతః కాలంలో విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజలు నిర్వహించారు. భద్రకాళీ అమ్మవారికి మూలవిరాట్‌కు పూజలు, కుంకుమార్చనలు నిర్వహించగా చుట్టుప్రక్కల గ్రామాల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకోగా అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.



ప్రత్యేకంగా ఆకు పూజలు

# అన్నప్రసాదం సేవా ట్రస్ట్‌కు రూ.10 వేలు విరాళం



విరాళం దాత కుటుంబసభ్యులను సన్మానించిన దృశ్యం

**లేపాక్షి, జూలై 26 ప్రభాతవార్త**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షిలోని శ్రీవీరభద్రస్వామి అన్నప్రసాదం సేవా ట్రస్ట్‌కు ఆదివారం బెంగళూరుకు చెందిన ప్రముఖ దాత శివానంద పాటిల్ 10 వేల రూపాయలను అందజేశారు. ఈ నగదును ఆయన వీరభద్ర అన్నప్రసాదం సేవా ట్రస్ట్ సభ్యులైన రామాంజనేయులు, వీరన్నలకు అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తుల ఆకలి తీర్చడం కోసం శివానంద పాటిల్ విరాళం అందచేయడం పట్ల ట్రస్ట్ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా దాత కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండండి : సిపిఐ గౌస్ పీర్



మాట్లాడుతున్న సిపిఐ కన్వీనర్ గౌస్ పీర్

**కనేకల్ జూలై 26 ప్రభాతవార్త**

జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ తరపున పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని కనేకల్ మండలం సిపిఐ పార్టీ మండల కన్వీనర్ గౌస్ పీర్ అన్నారు. కనేకల్ మండల కేంద్రం లోని సిపిఐ కార్యాలయం నందు ఆదివారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగింది ముఖ్య అతిథిగా కనేకల్ మండల కార్యదర్శి ఎం గౌస్ పీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గౌస్ పీర్ మాట్లాడుతూ ఈ కార్యవర్గం ముఖ్య ఉద్దేశం రాబోయే ఎన్నికలలో సిపిఐ పార్టీ కూడా ఎన్నికలకు పోటీకి శంఖం సిద్ధం అన్ని వార్డులకు పోటీ చేయటానికి సిద్ధం అదేవిధంగా ఆగస్టు 9వ తారీఖున దేశవ్యాప్తంగా కేంద్ర పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా మన అనంతపురం జిల్లా నుండి రాబోతున్న జీపు జాత మన కనేకల్ మండలానికి తొమ్మిదో తారీఖు పదో తారీకు ఈ రెండు రోజులు జీపు జాత శ్రీకారం చుట్టారు అన్నారు. భారత దేశంలో రైతులకు మరి కౌలు రైతులకు మరి వ్యవసాయ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇచ్చి అధికారం చేపట్టి 25 నెలల కాలంలో రైతులకు కౌలు రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేదు వర్షాల కారణంగా పంట నష్టపోయిన నష్టపరిహారం ఇంతవరకు ఇచ్చిన దాఖల లేదుఅన్నారు. కావున రాష్ట్రంలో కౌలు రైతులు గుర్తింపు కార్డు ఇవ్వకుండా రైతులు పండించిన పంటలు అకాలవర్షాలకు నష్టపోయిన పంట నష్టపరిహారం అందించలేదుఅన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు ఇవ్వకుండా ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి రైతులకు అందాల్సిన అందకపోగా రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య శరణమని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు కాబట్టి సిపిఐ పార్టీ మరియు ఏపీ రైతు సంఘం మరియు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జీపు జాతని నిర్వహించి ప్రతి పల్లె ప్రతి గ్రామము తిరిగి రైతుల సమస్యను రైతులు కష్టాలని తెలుసుకొని రైతులకు అండగా నిలిచి ఆత్మహత్యలకు పాల్పడద్దని ధైర్యం ఇస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి రైతుకు అన్ని విధాలుగా పరిహారం అందే వరకు పోరాటం చేస్తామని తీర్మానం చేసుకున్నాం ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం గౌస్ పీర్ సహాయ కార్యదర్శి ఎస్ బషీర్ మండల కార్యవర్గ సభ్యులు ఎస్ హెచ్ షఫీ జట్టి దాదా పీర్ చందా హుస్సేన్ కాక్రి జిలాన్ నూర్ బ్రజనార్ధన్ వద్దేతిప్పేస్వామి ఆబిదాబి శర్మాస్ బి సలీమా తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రితో యువత ఆన్‌లైన్ ఇంటరాక్షన్

వికసిత్ వైబ్రంట్ విలేజ్‌ఖిలో పాల్గొన్న డిఆర్‌ఓ కొండయ్య



ప్రధానమంత్రి ఆన్లైన్ ఇంట్రక్షన్లో పాల్గొన్న డిఆర్‌ఓ కొండయ్య, యువతి యువకులు

**శ్రీ సత్యసాయి జిల్లా, జూలై 26, ప్రభాతవార్త ప్రతినిధి**

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఖిమై భారత్‌ఖి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన వికసిత్ వైబ్రంట్ విలేజ్ ఆన్లైన్ ఇంట్రక్షన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో శ్రీ సత్యసాయి జిల్లా యువతీ యువకులు శనివారం ప్రత్యేకంగా ముచ్చటించారు. శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాకు చెందిన 30 మంది యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరిహద్దు గ్రామాల్లో యువతకు ఎదురైన అనుభవాలు, అక్కడ నేర్చుకున్న అంశాలు, జీవన విధానం గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. యువతలో సేవాభావం, దేశభక్తి పెరగాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన వికసిత్ వైబ్రంట్ విలేజ్ వర్క్‌షాప్‌లో జిల్లా తరపున ప్రతిభ చాటిన మైత్రి అనే యువతిని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో మై భారత్ కడప జిల్లా యువ అధికారి దీపక్ జేమ్స్, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కిషోర్, కలెక్టరేట్ సిబ్బంది, పలువురు యువకులు పాల్గొన్నారు.

# పట్టుచీరల వ్యాపారస్థుల సమస్యలపై ఈనెల 30న అవగాహన సదస్సు

- కరపత్రాల ఆవిష్కరణ
- అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకుల పిలుపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పట్టుచీరల తయారీ, వ్యాపారస్థుల సంఘం నాయకులు

**ధర్మవరంటౌన్, జూలై 26 ప్రభాతవార్త**

ధర్మవరం పట్టణంలోని శ్రీ శమీనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీన పట్టుచీరల తయారీ, వ్యాపారస్థుల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పట్టుచీరల తయారీ, వ్యాపారస్థుల సంఘం పట్టణ అధ్యక్షుడు గిర్రిజ రవి, సంఘ సభ్యుడు పోలా వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ధర్మవరం పట్టుచీరల తయారీ, వ్యాపార రంగం ప్రస్తుతం పలు సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గించే మార్గాలు, వస్త్ర పరిశ్రమలో నీటి వినియోగాన్ని తగ్గించే ఆధునిక సాంకేతికతలు, ఎంఎస్ఎంఈ (MSME) యూనిట్లకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సబ్సిడీలు, పెట్టుబడి అవకాశాలపై నిపుణులతో చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్, ధర్మవరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, టూ టౌన్ సీఐ జయనాయక్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పట్టుచీరల తయారీ, వ్యాపార రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ ఈ సదస్సుకు హాజరై ఉపయోగకరమైన సమాచారాన్ని పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు పోలా ప్రభాకర్, శశి, పల్లా నవీన్‌కుమార్, కలవల మురళి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

- నైతిక బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త**



మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

రాష్ట్రంలో నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న క్రమంలో సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో జరిగిన ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ పరీక్షల పేపర్ లీక్, అక్రమాల నేపథ్యంలో కేం ద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేశారని గుర్తు చేసిన మాజీ ఎమ్మెల్యే రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలపై తీవ్ర ఆరోపణలు, అభ్యర్థుల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎందుకు అదే నైతిక బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు. డీఎస్సీ పరీక్షలపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్, ప్రైవేటు కంటే మెరుగ్గా తీర్చిదిద్దడానికి మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద అభివృద్ధి, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ బోధన వంటి పథకాలను తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని విద్యా, ఉద్యోగ రంగాల్లో అనేక సంస్కరణలు అమలు చేసి వ్యవస్థను గాడిలో పెట్టారని వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంస్కరణలను కొనసాగించకుండా పక్కన పెట్టిందని, విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆయన ఆరోపించారు. విద్యాశాఖలో పరిపాలనా వైఫల్యాలు పెరిగాయాని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందన్న ఆయన విద్యార్థులు, నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని విమర్శించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు అధికమవుతున్నా అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా కాలయాప చేస్తోందని వాపోయారు. లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన పరీక్షల్లో చిన్న అనుమానానికీ తావు లేకుండా ఈ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీబీఐ దర్యాప్తు ద్వారానే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోడానికి వీలుంటుందన్నారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని వివరాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదలచేసి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం రాజకీయాలు చేయకుండా పారదర్శకంగా వ్యవహరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలతో కలిసి వైఎస్సార్‌సీపీ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హెచ్చరించారు.

# తొలి ఏకాదశి సందర్భంగా పెన్నా నది తీరాన భక్తుల సందడి



ఉట్ల పరుస మహోత్సవం

**పరిగి, జూలై 26 ప్రభాతవార్త**

పరిగి మండలం బాలి రెడ్డిపల్లి గ్రామం, పెన్నా నది తీరాన వెలసిన శ్రీ లక్ష్మి నరసింహాస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఉట్ల పరుస మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుండే చుట్టుపక్కల గ్రామాలైన పరిగి, శాసనకోట, నేతులపల్లి, కోడిగేనాహళ్లి, సింగి రెడ్డి పల్లి, ముదిరెడ్డి పల్లి, తదితర గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉట్లను పగలగొట్టే కార్యక్రమంతో భక్తి సందడి నెలకొంది. గోవిందా... నరసింహా నామస్మరణల తో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉత్సవానికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిగి ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, “పెన్నా నది తీరాన వెలసిన ఈ స్వామిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ప్రతి ఏటా తొలి ఏకాదశి రోజున ఈ ఉత్సవాన్ని చాలా భక్తి శ్రద్ధలతో జరుపుతాం. ఈసారి రాష్ట్రం నలుమూలల నుండి కూడా భక్తులు వచ్చారు“ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# పోలీసుల ప్రత్యేక బందోబస్తు



ఆలయం వద్ద బందోబస్తు వున్న పోలీసులు

**లేపాక్షి, జూలై 26 ప్రభాతవార్త**

లేపాక్షి వీరభద్రస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, స్థానిక ఎస్ఐ నరేంద్ర తమ సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. భక్తుల భద్రతే ధ్యేయంగా ఆలయ ప్రాంగణంలో విస్తృతంగా బందోబస్తు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. జేబుదొంగతనాలు, ఇతర చిన్నపాటి నేరాలు జరగకుండా అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సిఐ తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా,



ఆలయ పరిసరాల్లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా నిరంతరం గస్తీ నిర్వహిస్తూ రక్షణ చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మినరసింహాస్వామి ఉత్సవాలు

**ధర్మవరం రూరల్, జూలై 26 ప్రభాతవార్త**

మండలంలోని పోతుకుంట గ్రామం ఎస్సీ కాలనీలో శ్రీలక్ష్మినరసింహాస్వామి ఉత్సవాలను ఆదివారం అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా తొలిఏకాదశిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని గ్రామానికి సమీపంలోని గుట్ట వద్ద నుంచి ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన ఖివంజుశ్యావాఖితో గ్రామంలో ఘనంగా ఊరేగించారు. స్వామి ఆవహించిన పూజారి పంజుశ్యావాతో ఉరుములు, దప్పుల వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అపూర్వ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి “గోవిందా.. గోవిందా“ అంటూ నామస్మరణ చేశారు. అనంతరం పూలపల్లకిలో స్వామివారిని ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాన్ని విద్యుత్ దీపాల తోరణాలతో అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ధర్మవరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు బెంగళూరు నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి వేళల్లో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కోలాహలంగా సాగాయి.



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మినరసింహాస్వామి

# సుందరమైన రహదారులు

**కనేకల్, జూలై 26 ప్రభాతవార్త**



అద్వాన స్థితిలో దారి

దేశం బాగుండాలంటే గ్రామాల అభివృద్ధి చెందాలని గ్రామాల అభివృద్ధి తమ ధ్యేయంగా పనిచేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల్లో అనేక మార్పులు చేస్తూ అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్న కొందరు అధికారుల నిర్లక్ష్య ధోరణి వలన కొన్ని గ్రామాల్లో 50 ఏళ్ల నుండి మార్పు రాకుండా ఇలాగే ఉన్నాయి. కనేకల్ మండల పరిధిలోని తుమ్మిగనూరు గ్రామంలో నడి ఊరిలోని ప్రధాన రహదారిపై మురికి కాలువ ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని గ్రామాల్లో పారిశుధ్యం పడగ విప్పిందని గ్రామానికి అధికారులు, రాజకీయ నాయకులు పలుమార్లు వచ్చినప్పటికీ సమస్యను పరిశీలించి వెళ్లిపోవడం తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదని ఆ గ్రామ ప్రజలు విమర్శించారు. మురికి నీరు రోడ్డుపైనే పారుతుండటంతో పాదచారులు, విద్యార్థులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి ప్రమాదాలకు కారణమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై మురుకి నీరు నిల్వ ఉండి ప్రజలకు వివిధ రోగాలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ అధికారులను ఆ గ్రామస్తులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి కాలువను తొలగించి, యథావిధిగా రహదారిని నిర్మించి గ్రామస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తుమ్మిగనూరు గ్రామస్తులు కోరుతున్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి ఉమేష్

**అగళి, జూలై 26 ప్రభాతవార్త**

తెలుగుదేశం ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు ఇంటింటికి వెళ్లి చేరవేయాలని ఉద్దేశంతో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర బాలల హక్కుల సంఘ సభ్యులు శ్రీనివాస్ మూర్తి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు జెడ్పిటిసి ఉమేష్ తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమం ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కార్యకర్త తెలియజేయాల్సి ఉందన్నారు. రేపటి నుంచి అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ తిప్పేస్వామి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ మూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, సింగల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, మార్కెట్ డైరెక్టర్ కెంచు యాదవ్, మాజీ ప్రధాన కార్యదర్శి జయరాం, మాజీ ఎంపీపీ బసవరాజు, శివలింగప్ప, మంజునాథ్, నాగోజప్ప, మల్లేష్, హేమంత్, శివన్న, రాజి, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా జీవనం సాగించండి

నెరమెట్ల గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ పి.జనార్ధన నాయుడు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పి.జనార్ధన నాయుడు

**ఉరవకొండ, జూలై 26 ప్రభాతవార్త**

అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు దూరంగా అందరూ కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించాలని ఉరవకొండ ఎస్ఐ పి.జనార్ధన నాయుడు సూచించారు. మండల పరిధిలోని నెరమెట్ల గ్రామంలో జరుగుతున్న వన్నూరు స్వామి ఉరుసు సందర్భంగా ఆదివారం రాత్రి ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మట్కా, జూదాలు, ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్, గంజాయి ఇతరత్రా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, పిల్లల పట్ల గౌరవభావంతో ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని లాటరీలో డబ్బులు వచ్చాయి, లక్కీ డిప్ లో గిఫ్టులు తగిలాయని, మీ మొబైల్ కు ఓటీపీలు వచ్చాయి షేర్ చేయాలని ఎవరైనా అడిగితే స్పందించవద్దన్నారు. సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టులు పెట్టవద్దని ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకున్న తర్వాతే స్పందించాలని సూచించారు. చిన్న పిల్లలపై నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా శక్తి, స్త్రీట్ రక్ష యాప్ లతోపాటు డయల్ 100, 1098, 1930 ల గురించి అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపే సమయంలో తప్పక సీటు బెల్టు ధరించాలని ఎస్ఐ పి.జనార్ధన నాయుడు సూచించారు.

# ఇంటింటా తెలుగేదేశం పార్టీ కార్యక్రమం విజయవంతం చేయండి

**మడకశిర టౌన్ జులై 26, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ అధినేత సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుల ఆదేశాలమేరకు ఈనెల 27 నుండి మడకశిర నియోజకవర్గంలో నిర్వహించే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం విజయవంతం చేయడం కోసం ఆదివారం మడకశిర పట్టణంలోని మాజీ ఎమ్మెల్సీ స్వగృహంలో మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు ఈ నెల జూలై 27 వ తేది నుండి డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహణ మీటి నిర్వహించడం జరిగింది డి2డి వెరిఫికేషన్ సోమవారం నుంచి అన్ని పంచాయతీ నందు ప్రారంభించాలని కోరడమైనది రోజుకు 30 కుటుంబాల సందర్శించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలుల హక్కుల కమిషన్ నెంబర్ శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ అధ్యక్షులు నాగేంద్ర, కన్వీనర్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి తిమ్మరాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు తల్లికి వందనం వర్తింపు పై హార్షం

- రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నల్లపల్లి విజయ్ భాస్కర్

**అనంతపురం న్యూటౌన్, జులై 26 ప్రభాతవార్త**



మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం అందజేస్తున్న నల్లపల్లి విజయ్‌భాస్కర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి సిబ్బందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ హార్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ సిబ్బందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం ఇచ్చిన సంగతి ఆయన గుర్తు చేశారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని అంగన్వాడీలకు వర్తింప చేయడంపై నల్లపల్లి విజయ్ భాస్కర్ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా కొంతమంది అంగన్వాడీ సిబ్బందికి సాంకేతిక కారణాలు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో ప్రభుత్వ ఉద్యోగి అని ఉండడం వల్ల తల్లికి వందనం వర్తింపు జరగలేదని అన్నారు.అదే విధంగా కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా తల్లికి వందనం పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# 351 కళింగర కాయలతో గోమాతలకి గో సేవ



కళింగర కాయలతో గోమాతలకి గోసేవ చేస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్, జులై 26 ప్రభాతవార్త**

ప్రతి ఆదివారం నిత్యం శ్రీవారి సేవకులచే, దాతల సహాయ సహకారాలుచే కోసేవ కార్యక్రమం మీరు రామంగా జరుగుతోంది. ఆదివారం ప్రత్యేకంగా ఆ గోమాతలకి 351 కలింగర కాయలతో గో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ..ఉదయం 8:30 గంటల నుండి 9 గంటలకు జరిగే గో సేవ కార్యక్రమంలో ఎవరైనా ఉచితంగా పాల్గొని ఆ శ్రీవారి ఆశీస్సులు అలాగే గోమాత ఆశీస్సులు పొందాలని కోరుతున్నామన్నారు. అలాగే ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవారి సేవకులు అనిల్ ప్రసాద్, శివ ప్రకాష్, సుంకు రెడ్డి, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. శివ, ప్రకాష్, అనిల్, ప్రసాద్, సురేష్, నాగరాజు, సుంకు రెడ్డి, ఆళ్లగడ్డ రాము, ఆలయ ధర్మకర్త శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం శ్రీనివాస్ నగర్ అనంతపూర్ తొలి ఏకాదశి సందర్భంగా అమ్మ ఆళ్లగడ్డ నాగలక్ష్మి అమ్మ రామాలయ కమిటీ మెంబర్స్ అందరికీ, ధాతలకి విగ్రహాల అందించడం జరిగింది.

28అనంతలో తరిమెల నాగిరెడ్డి..

# రేవులపల్లి వెంకటేశ్వరరావు సంస్మరణ సభ

- యుసిసిఆర్ఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు సి.భాస్కర్

**అనంతపురం, జులై 26 ప్రభాతవార్త బ్యూరో**

కమ్యునిస్టులు, విప్లవ అగ్రనాయకులు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావుల సంస్మరణ సభ ఈ నెల 28వ తేదిన అనంతపురంలో భారత కమ్యునిస్టు విప్లవ కారుల సమైక్యత కేంద్రం (ఎం.ఎల్) అనంతపురం జిల్లా శాఖ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేత సి.భాస్కర్ వెల్లడించారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో సాయంత్రం 5:30 గంటలకు జరిగే సంస్మరణ సభ జరుగుతుందన్నారు. ఈ సభలో ఉపన్యాసకులుగా విప్లవ రచయిత, సాహితీ విమర్శకులు జట్టి శ్రీరామ్, ఓపిడిఆర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలు, గ్రామీణ పేదల సంఘం నాయకులు బి.భాస్కర్, భారత-చైనా మిత్ర మండలి రాష్ట్ర కార్యదర్శి వై.అజయ్‌రెడ్డి, ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారెడ్డి, గ్రామీణ పేదల సంఘం జిల్లా కన్వీనర్ కె.నాగభూషణం తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కామ్రేడ్ బి.వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి చూపిన విప్లవ మార్గంలో పయనించడమే ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కారమని, ఈ ఇద్దరు అగ్రనాయకులు జులై నెలలో మరణించారని ఆయన తెలిపారు. ఆఖరి క్షణం వరకు విప్లవోద్యమ నిర్మాణ కృషిలో నిమజ్ఞులైన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, బి.వెంకటేశ్వరరావు జీవితాలు విప్లవ కారులకు ప్రత్యేకించి యువతకు ఆదర్శమైనవన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేదిన అనంతపురంలో జరిగే సంస్మరణ సభకు అన్ని రంగాల ప్రజలు, విప్లవ సానుభూతి పరులు, శ్రేయోభిలాషులు హాజరు కావాలని యుసిసిఆర్ఐ (ఎంఎల్) ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

# నేడు జిల్లా స్థాయి అండర్17 టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపికలు

**అనంతపురం న్యూటౌన్, జులై 26 ప్రభాతవార్త**

ఈ నెల 27వ తేదీన ఉమ్మడి అనంతపూర్ జిల్లా అండర్-17 బాలురు, బాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అన్వర్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు అనంతపురంలోని ఆర్డిటి స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఉదయం 9:00 గంటల నుండి ప్రారంభమవుతాయని ఆయన వివరించారు. ఈ ఎంపిక ప్రక్రియకు కరణం మహేష్ గారు సెలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు (బాలురు, బాలికలు) తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో హాజరు కావాల్సి ఉంటుంది. ప్లేయర్ ఎంట్రీ ఫీజుగా రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎంపికలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలురు మరియు బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేయడం జరుగుతుంది. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 8,9 జరిగే రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ (జిల్లాల మధ్య) టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే, జిల్లా కార్యదర్శి అన్వర్ బాషా గారిని 6309430837 నంబర్‌లో సంప్రదించగలరు. కావున ఆసక్తి ఉన్న అండర్-17 క్రీడాకారులు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, నిర్ణీత సమయానికి ఆర్డిటి స్టేడియంలోని క్రికెట్ నెట్స్ వద్దకు హాజరు కావాలని కోరారు.

# ఘనంగా కార్గిల్ దివాస్..

మాజీ సైనికులకు సన్మానం




మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మాజీ సైనికులు

**అనంతపురం, జులై 26 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం హెచ్ఎల్‌సి కాలనీలో మాజీ సైనికుల సంఘ కార్యాలయంలో కార్గిల్ దివాస్‌ను పురస్కరించుకుని మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కం సివిల్ జడ్జ్ ఎన్ రాజశేఖర్, అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న ఆధ్వర్యంలో 1999లో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి రాజశేఖర్ మాట్లాడుతూ సైనికుల సేవలు దేశ ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరు. ఎల్లప్పుడు ప్రజలు సైనికుల సేవలకు కృతజ్ఞులై ఉంటారు అన్నారు. మేము మాజీ సైనికులకు అవసరమైన లీగల్ సర్వీసెస్ ఇవ్వటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. గేట్స్ కాలేజ్ ఓనర్ వీకే శ్రీవాణి, సంఘ ముఖ్య సలహా వికే రంగారెడ్డి, సామాజిక కార్యకర్త అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సన్మాన సభ సందర్భంగా కార్గిల్ విజయ్ దివస్ రోజున ఒక మంచి నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతో ఎన్‌టిఆర్ భోజన పథకమునకు మాజీ సైనికుల తరపున అనంతపురం పట్టణంలో ఒక అన్న క్యాంటీన్‌కు ఒక పూట భోజనానికి అయ్యే ఖర్చులు భరించాలని నిర్ణయించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వారిని కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, కుమారస్వామి, తిమ్మారెడ్డి, మహమ్మద్ మసూద్ వలి, కరణం కృష్ణ, గోపీచంద్, మహబూబ్ పీరా, జింక రామ్మూర్తి, సాయికుమార్, ఎం.కృష్ణయ్య, రేవన్న, బాబు తదితరులు సన్మానించారు.

# మోడల్ టెట్ నిర్వహించడం అభినందనీయం



మాట్లాడుతున్న డిఇఓ

**అనంతపురం న్యూటౌన్, జులై 26 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని శారదా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఎపి టెట్ మోడల్ టెస్ట్-2026ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఇఓ ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రశ్న పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ మాట్లాడుతూ.. ఇదొక సామాజిక బాధ్యతగా తీసుకొని దీనిని మంచిగా నిర్వహిస్తున్న వారిని అభినందిస్తూ మంచి సబ్జెక్టు నాలెడ్జ్ కలిగిన ఉపాధ్యాయులచే తయారుచేసారని వారిని అభినందించారు. ఈ పరీక్షలో దాదాపు వందమంది ఇన్ సర్వీస్ టీచర్లు, డి.ఎస్.సి అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శారదా పాఠశాల ప్రధానోపాధ్యాయినిరాలు డి.సుష్మలత, ఉపాధ్యాయులు తులసి రెడ్డి, మహారాఘవేంద్ర రాజు, ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నాయి.

# ప్రాణాలైనా అర్పిస్తాం... దళితులకు ఇళ్ళపట్టాలు సాధిస్తాం



దళితులతో మాట్లడుతున్న కేవీపిఎస్ నాయకులు

**బుక్కరాయసముద్రం జులై 26 ప్రభాతవార్త**

ప్రాణాలైన అర్పిస్తాం జంతులూరు గ్రామంలోని దళితులకు ఇళ్ళపట్టాలు సాదిస్తామని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప,కార్యదర్శి మాల్యాద్రి స్పష్టం చేశారు.ఆదివారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని జంతులూరు గ్రామాన్ని సందర్శించి.దళిత ప్రజలతో సమావేశమై ఇల్లపట్టాలు,దళితులకు స్మశానవాటిక రహదారి విషయమై దళితులతో చర్చించారు.ఇళ్ళపట్టాలకు కేటాయించిన సర్వేనంబర్ 276లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న విఆర్ఓ కుమార్‌స్వామి భార్య విజయ లలిత పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడం దుర్మార్గమైన చర్య,అధికారులు వెంటనే భామిని ఆన్లైల్లో తొలగించి ప్రభుత్వం స్వాదీనం చేసుకొని దళితులకు ఇళ్ళ పట్టాలుఇవ్వాలని గత కొన్ని నెలలుగా సంబందిత తహశీల్దార్ కార్యాలయం చుట్టూతిరుగుతున్న అధికార్లు మాత్రం ఆ భూమిని ఆన్‌లైల్లో తొలగించలేదు,ఈ విషయం పై జిల్లా కలెక్టర్‌కు కూడ స్పందనలో తెలియ పరిచిన ఫలితం మాత్రం శూన్యం.ఇలా ఎంత కాలం అధికారులు చుట్టూతిరగాలి అని ఆవేదన వ్యక్తంచేశారు.సమస్యను పరిష్కరించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవు అని కేవీపీఎస్ నాయకులు హెచ్చరించారు.

# దళిత విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యపు నీడ

మొదటిపేజీ తరువాయి...

తీరడంతో పాటు విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి నిరుపయోగం

ప్రజల పన్నుల సొమ్ముతో నిర్మించిన ఈ ప్రభుత్వ భవనం ప్రస్తుతం వినియోగంలో లేక శిథిలమవుతుండటం వల్ల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి వృథా అవుతోంది. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టకపోతే భవనం పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని, అనంతరం పునర్నిర్మాణానికి మరింత భారీ నిధులు అవసరమవుతాయని స్థానికులు హెచ్చరిస్తున్నారు. తక్షణమే మరమ్మతులు చేపడితే తక్కువ వ్యయంతో తిరిగి వినియోగంలోకి తీసుకురావచ్చని సూచిస్తున్నారు. గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల విజ్ఞప్తి ములకలేడు గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు, సామాజిక సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతూ ఈ వసతి గృహాన్ని వెంటనే పరిశీలించాలని, అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మించి మళ్లీ ఎస్సీ బాలుర వసతి గృహంగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### అధికారులు స్పందించరా...?

ఒకప్పుడు దళిత విద్యార్థుల జీవితాలను వెలిగించిన ఈ ప్రభుత్వ హాస్టల్ నేడు శిథిలాల మధ్య తన గత వైభవాన్ని గుర్తు చేసుకుంటూ మూగసాక్షిగా నిలిచింది. చదువుల వెలుగులు నింపిన ఈ

### వసతి వసతి గృహానికి మళ్లీ జీవం పోసేది ఎప్పుడు?

సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ చారిత్రక వసతి గృహాన్ని పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# డిఎస్సీ అక్రమాలకు నారాలోకేష్ బాధ్యత వహించి రాజీనామా చేయాలి

- మాజీ మేయర్ మహ్మద్ వసీం

**అనంతపురం సిటీ, జులై 26 ప్రభాతవార్త**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ మహ్మద్ వసీం

రాష్ట్రంలో నిర్వహించిన డిఎస్సీలో అక్రమాలు చోటు చేసుకుని అక్రమాలకు అన్యాయం జరిగిందని దీనికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలని, మాజీ మేయర్ మహ్మద్ వసీం డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా చేశారన్నారు. అదే తరహాలోనే రాష్ట్రంలో డిఎస్సీలో అక్రమాలు చోటు చేసుకుని అర్హులకు అన్యాయం జరిగిన నేపథ్యంలో మంత్రి నారాలోకేష్ బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంతో గోప్యంగా జరగాల్సిన డిఎస్సీ ప్రశ్న పత్రాల తయారీ అంశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రమేయంతో అక్రమాలకు అవకాశం ఏర్పడిందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు రావడమే ఇందుకు నిదర్శనమైతే, ర్యాంకు వచ్చినా అతనికి ఉద్యోగం ఇవ్వక పోవడం అక్రమాలను పరోక్షంగా అంగీకరించడమేనని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నోరు విప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే సిబిఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వైసిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# క్రీడలలో బాలికలకు ఉన్నత అవకాశాలు

- సిఐ ఇస్మాయిల్

- బాలికల ఫుట్ బాల్ విజేత సత్యసాయి జట్టు




విజేతలకు బహుమతులు అందిస్తున్న సిఐ ఇస్మాయిల్

**అనంతపురం సిటీ, జులై 26 ప్రభాతవార్త**

బాలికలకు క్రీడలలో ఉన్నత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని జాతీయ జట్టులో స్థానం సంపాదించాలని సిఐ ఇస్మాయిల్ సూచించారు. ఆర్డిటి క్రీడా మైదానంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న బాలికల జూనియర్ ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లో సత్యసాయి జట్టు విజేతగా నిలిచింది. తూర్పు గోదావరి సత్యసాయి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఒక పాయింట్ సాధించి సత్యసాయి జట్టు విజేతగా నిలిచింది. బహుమతుల ప్రధాన కార్యక్రమానికి జాతీయ స్థాయి క్రీడా కారుడు, సిఐగా విధులు నిర్వర్తిస్తున్న ఇస్మాయిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలలో రాణిస్తే క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించ వచ్చని అందుకు తానే నిదర్శనం అన్నారు. ఫుట్‌బాల్‌లో బాలికలకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. కృషి, పట్టుదలతో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజేతలతోపాటు రన్నర్స్‌గా నిలిచిన జట్టు సభ్యులకు షీల్డ్‌లను, పథకాలను అందజేశారు. అదే విధంగా మూడవ స్థానంలో అనంతపురం జట్టు, 4వ స్థానంలో కర్నూలు జట్టు నిలిచింది. కార్యక్రమంలో ఏడిఎఫ్ఏ జిల్లా అధ్యక్షులు దాదాఖలందర్, కోశాధికారి మల్లేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కృష్ణ జిల్లా అధ్యక్షులు అనిల్‌లతోపాటు కోచ్‌లు రాజా, వరలక్ష్మిలతోపాటు పలువురు రెఫరీలు పాల్గొన్నారు.

# ఎస్సీకాలనీ వాసుల తాగునీరు సమస్యను తీర్చిన దానిష్ స్వచ్ఛంద సేవా సంస్థ

**ఆత్మకూరు జులై 26 ప్రభాతవార్త**



ఎస్సీ కాలనీలో దానిష్ సంస్థ ఏర్పాటు చేసిన చేతిపంపు

మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో దానిస్,అవ్వ అనే స్వచ్ఛంద సంస్థలు చేతిపంపు ఏర్పాటు చేసి కాలనీ ప్రజల తాగునీరు సమస్యను తీర్చడం జరిగింది. ఆదివారం మాజీ సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో దానిస్ సంస్థ వారు ఏర్పాటు చేసిన చేతిపంపు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సత్యసాయి నీరు రాని సమయంలో కాలనీ ప్రజలు తాగునీరు కోసం పడుతున్న ఇబ్బందులను అవ్వ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థను స ంప్రదించగా వారు దానిస్ సంస్థ సహకారంతో కాలనీలో బోరు వేయించి చేతిపంపు ఏర్పాటు చేసి తాగునీరు కొరత తీర్చడం జరిగిందన్నారు.కాలనీ ప్రజలు తాగునీరు సమస్యను తీర్చిన సంస్థ ప్రతినిధి నూర్ మహమ్మద్,సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కడపం దామోదర్‌కు సన్మానం

**నార్పల జులై 2, ప్రభాతవార్త**

విజయవాడలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో, గ్రామ కమిటీల ఏర్పాటు, గ్రామ పర్యటనల ద్వారా అనంతపురం జిల్లాలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన అనంతపురం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నార్పల కి చెందిన కడపం దామోదర్‌ని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సింబుజీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శమధుకర్ జీ, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కడపం దామోదర్ మాట్లాడుతూ, ఈ గౌరవానికి కారణమైన రాష్ట్ర నాయకత్వానికి, అనంతపురం జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ కి,రాష్ట్ర జిల్లా నాయకులకి కిసాన్ మోర్చా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బిజెపి పార్టీ బలోపేతానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

# ఎపి టెట్-2026 పరీక్షలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలి

**అనంతపురం న్యూటౌన్, జులై 26 ప్రభాతవార్త**

ఎపి టెట్-2026 పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్రిస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు హాజరయ్యే సందర్భంలో ప్రభుత్వం ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అదే విధంగా, ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా పరీక్ష రాసే రోజున ఆన్ డ్యూటీ మంజూరు చేయడం సముచితమని పేర్కొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి

ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్

**అనంతపురం కలెక్టరేట్ జూలై 26 ప్రభాతవార్త**



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 ,30 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా , తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అలాగే సోలార్ ప్యాంటును పరిశీలించారు.సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 వరకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చునని తెలియజేశారు. అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి జిల్లా 9963707847. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఘనంగా ప్రగఢ కోటయ్య శతజయంతి వేడుకలు



ప్రగఢ కోటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, జులై 26 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండలం ఏ. నారాయణ పురం పంచాయతీ లో గల పద్మశాలి మార్కండేయ కళ్యాణ మండపం దగ్గర పద్మశాలీల కుల బాంధవుడు ప్రగడకోటయ్యశతజయంతి నీ వేడుకలు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జింక సూర్యనారాయణ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, కుల బాంధవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీల కుల బాంధవుడు ప్రగఢ కోటయ్య శత జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వముగుర్తించడంవల్ల అనంతపురం నగరకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళులర్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈసీ మెంబర్స్ జానపాటి సత్యనారాయణ, వేల్పుల సాయి,గోరంట్ల చలపతి, అనంతపురం జిల్లాపద్మశాలి సంఘం అధ్యక్షుడు జింకా సూర్యనారాయణ, అనంతపురం నగర అధ్యక్షులు దేవరకొండ నరసింహులు, కళ్యాణ్ దుర్గం నగర అధ్యక్షులు గోపీనాథ్, మహేష్ చంద్ర శేఖర్, కాలవ సుబ్బరాయుడు, రాము, వెంకటేష్, సోమశేఖర్, పద్మశాలికులబాంధవులు అందరూ పాల్గొన్నారు.

# మిఠాయి దుకాణంలో బాలకార్మికులు?

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు..

**గార్లదిన్నె,జులై 26,ప్రభాత వార్త:**

గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో ఓ మిఠాయి దుకాణంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించే దుకాణం కావడంతో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, అపరిశుభ్ర వాతావరణంలో మిఠాయిలు, ఇతర ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదే దుకాణంలో బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ, ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది.సంబంధిత కార్మిక శాఖ, ఆహార భద్రతా శాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రూ.20 వేల ఆర్థిక సహాయం

**గార్లదిన్నె, జులై 26, ప్రభాత వార్త:**



రమేష్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి.

గార్లదిన్నె మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన రమేష్ మృతి చెందగా, ఆదివారం ఆయన భౌతికకాయానికి ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు టీడీపీ సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి,స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వర్షం కోసం దుర్గమ్మ తల్లికి బోనాలు



అమ్మవారికి భోనాలు తీసుకెళ్తున్న మహిళలు

**శింగనమల, జులై 26 ప్రభాతవార్త**



మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో వర్షం రావాలని గ్రామంలోని గ్రామస్తులు ఆదివారం గ్రామ దేవత దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీసుకుని అమ్మవారికి సమర్పించారు.

## నేడు రేవెన్యూ భవన్లో ప్రజా సమస్యలు ఫిర్యాదుల పరిష్కార వేదిక..

**జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్..**



కొత్తచెరువు,జూలై 26: ప్రభాతవార్త.

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్) లో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుంది.ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ కోరారు.ఈ నెల 27న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చున్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. రేవెన్యు భవన్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## షిరిడి సాయిబాబా విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం జూలై 26 ప్రభాతవార్త



షిరిడిసాయిబాబా విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ

బుక్కరాయసముద్రం చెరువు కట్ట పై ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 23 అడుగుల శ్రీ షిరిడి సాయిబాబా సజీవ శిల్ప విగ్రహంను ఆదివారం ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ ప్రారంబించారు.సజీవ శిల్ప రూపకర్త రాజేష్ అత్యంత అద్భుతమైన నైపుణ్యంతో ఈ సాయిబాబా విగ్రహాన్ని ంరైఊపొందించారు. షిరిడి అనంతరం భక్తులను విశేషంగా ఆకట్టుకునేంత అద్భుతమైన సజీవ శిల్ప రూపంలో సాయిబాబా విగ్రహం బుక్కరాయసముద్రం లో ప్రతిష్టంచడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణం అన్నారు.ఈ పుణ్యక్షేత్రం భవిష్యత్తులో భక్తులకు ఆధ్యాతిక కేంద్రంగా నిలుస్తుందని ఆకాంక్షించారు.అనంతరం నిర్వహించిన లక్ష్మిపూజ-గోరింటాకు మహోత్స వం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ షరిడిసాయినాథ్ సేవా సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం,శాశ్వత గౌరవ అధ్యక్షులు విజయనాథ్,ఇరిగేషన్ డిఈ రాజా,సింగిల్విండో అధ్యక్షులు కేశన్న,మండల కన్వీనర్ లక్ష్మినారాయణ,టిడిపి నాయకులు శ్రీరామిరెడ్డి,జీసీ బాబు,రవీంద్ర,ఓబులపతి,తోపాటు పలువురు నాయకులు షిరిడిసాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

### పోలోసాఫ్ట్ టెక్నాలజీస్ ఆన్క్యాంపస్ నియామకాల్లో

## పీవీకేకే ఐటీ విద్యార్థుల ప్రతిభ..



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం, జులై 26 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురంలోని పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో ప్రముఖ సంస్థ పోలోసాఫ్ట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్లో కళాశాలకు చెందిన 2026 బీటెక్ పాస్అవుట్ విద్యార్థులలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్లేస్మెంట్ డీన్ డా.భాను కిరణ్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రతినిధులతో కలిసి అభినందించారు. టెలికాం జీఐఎస్ డొమైన్ల కోసం నిర్వహించిన ఈ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులు జీఐఎస్ ఇంజనీర్టెలికాం ఇంజనీంహోదాల్లో హైదరాబాద్ విధులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఆటోక్యాడ్, జీఐఎస్ టూల్స్, ఎంఎస్ ఎక్సెల్, డాక్యుమెంటేషన్ అంశాలపై ప్రాథమిక అవగాహనను పరీక్షించారు. అనంతరం అప్లికేషన్ స్క్రీనింగ్ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 27 మంది విద్యార్థులను తుది ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వార్షికంగా రూ.3 లక్షలు వేతన ప్యాకేజీ అందించనున్నట్లు సంస్థ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పీవీకేకే ఐటీ చైర్మన్ డా.కిషోర్ పల్లె, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వహీదా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలను కళాశాలకు ఆహ్వానించి విద్యార్థులకు అత్యుత్తమ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిరంతరం కృషి చేస్తోందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

# ఊరిస్తున్న మేఘాలు..వీస్తున్న గాలులు..!

- పండ్లతోట రైతుల్లో పెరుగుతున్న ఆందోళన..
- బిందు సేద్యంలో ఆవిరవుతున్న తేమ..
- దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం

ధర్మవరం రూరల్ జూలై 26 ప్రభాతవార్త

ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో ఉద్యాన పంటలే వేలాది మంది రైతుల జీవనాధారం. మామిడి, దానిమ్మ, బత్తాయి, నిమ్మ, జామ, బొప్పాయి తదితర పండ్లతోటలను ఎక్కువగా బిందు సేద్యం ఆధారంగా సాగు చేస్తున్నారు. అయితే గత కొద్ది రోజులుగా మేఘావృత వాతావరణంతో పాటు వేగంగా వీస్తున్న గాలులు రైతులను కలవరపెడుతున్నాయి. బిందు సేద్యం ద్వారా మొక్కలకు అందించే నీటిలో కొంత భాగం గాలి ప్రభావంతో త్వరగా ఆవిరైపోవడంతో వేర్ల వద్ద తేమ నిల్వ తగ్గుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



చెట్టుకు గాల్లో తేమశాతం ఆవిరి కాకుండా వేసిన ప్లాస్టిక్ కవర్లు

### సమస్య ఏంటి..?

బిందు సేద్యం ద్వారా నీరు నేరుగా మొక్క వేర్లకు చేరాల్సి ఉండగా, అధిక గాలులు, పొడి వాతావరణం కారణంగా నేల ఉపరితలంపై ఉన్న తేమ వేగంగా తగ్గుతోంది. ఫలితంగా మొక్కలకు అవసరమైన తేమ ఎక్కువసేపు నిల్వ ఉండకపోవడంతో ఎదుగుదల మందగించడం, పూత, పిందె రాలిపోవడం, కాయల పరిమాణం తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పెరిగిన సాగు ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఇది మరో భారంగా మారింది.

### కారణాలివే

వాతావరణంలో తేమ శాతం మారడం, వేగంగా వీచే గాలులు, మధ్యాహ్న సమయంలో బిందు సేద్యం నిర్వహించడం, మొక్కల చుట్టూ మల్చింగ్ లేకపోవడం వంటి కారణాలతో నేలలోని తేమ త్వరగా తగ్గిపోతుందని ఉద్యాన నిపుణులు సూచిస్తున్నారు. కలుపు మొక్కలు కూడా నేల తేమను అధికంగా వినియోగించడం వల్ల మొక్కలకు అందాల్సిన నీటి శాతం తగ్గుతోంది.

### ఇలా చేస్తే తేమ నిలుస్తుంది

పండ్లతోటల్లో బిందు సేద్యాన్ని ఉదయం లేదా సాయంత్రం వేళల్లో నిర్వహించడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. మొక్కల చుట్టూ ఎండిన ఆకులు, వరి గడ్డి, కొబ్బరి పీచు వంటి సేంద్రియ పదార్థాలతో మల్చింగ్ చేయడం ద్వారా తేమ ఎక్కువసేపు నిల్వ ఉంటుంది. డ్రిప్ లైన్లు, డ్రిప్పర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తరచూ పరిశీలించాలి. అవసరమైన మేరకే నీటిని విడతల వారీగా అందించాలి. కలుపు మొక్కలను తొలగించడం ద్వారా కూడా తేమను సంరక్షించవచ్చు. గాలుల ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాల్లో గాలి నిరోధక మొక్కలను పెంచడం ప్రయోజనకరంగా ఉంటుంది...

### ఉద్యానశాఖ చొరవ అవసరం

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తేమ సంరక్షణపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. బిందు సేద్యాన్ని సమర్థంగా వినియోగించే విధానాలపై ప్రత్యేక శిక్షణలు నిర్వహించడంతో పాటు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తే పంటలను నష్టాల నుంచి కాపాడుకునే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు...

### సకాలంలో చర్యలే భరోసా

ధర్మవరం ప్రాంతంలో ఉద్యాన పంటలే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు, తేమ సంరక్షణ చర్యలపై మార్గనిర్దేశం చేయడం అత్యవసరంగా మారింది. ప్రభుత్వం, ఉద్యానశాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడితే పండ్లతోటలను కాపాడుకోవడంతో పాటు రైతుల ఆదాయానికి భరోసా కల్పించే అవకాశం ఉంది.

## కురుగుంట కస్తూర్బా కళాశాల నూతన భవనాలను ప్రారంబించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత.

- కస్తూరిబా కళాశాలకు 50వేల విరాళం.

అనంతపురం రూరల్, జులై 26 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడేపరిస్థితివచ్చిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతఅన్నారు. అనంతపురంరూరల్, పరిధిలోనికురుగుంట గ్రామ సమీపంలో కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల నూతన భవనాల ప్రారంభోత్స వ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కళాశాలకు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు విద్యార్థులు,ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. 1కోటి 60లక్షల ఏ.డబ్ల్యు.పి నిధులతో నిర్మించిన కళాశాల నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం తరగతి గదులు, టాయిలెట్స్, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ లాబ్ ను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. కస్తూర్బా పాఠశాలలో అభివృద్ధి పనులకు 50వేల రూపాయలు విరాళం అందించారు. ఆ తర్వాత కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో 5గురుకుల జూనియర్ కళాశాలల్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. అంతేకాకుండా అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఈ కళాశాలల్లో చేరేందుకు విపరీతమైన పోటీ ఉందని అన్నారు. తమ వద్దకు వచ్చి ఫలానా కళాశాల, పాఠశాలలో చేరేందుకు సిఫార్సు చేయమని అడిగే పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి ప్రధానమైన కారణం విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ తీసుకొచ్చిన మార్పులు అని అన్నారు. గతంలో పిల్లల చదువుకునే పుస్తకాలు, చివరికి బెల్టుల మీద కూడా జగన్ రెడ్డి బొమ్మ వేసుకున్నాడని విమర్శలు చేశారు. అందుకే అలాంటి వాటికి తావు లేకుండా సర్వేపల్లి రాధాకృష్ణ, డొక్కా సీతమ్మ వంటి గొప్ప వారి పేర్లతో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో కంటే నాణ్యమైన విద్యా కిట్లుఅందజేస్తున్నారన్నారు. విద్యా సంస్థల్లో ఎక్కడా రాజకీయాలకు తావు లేకుండా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకున్నారన్నారు. తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ అందుతోందని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈరోజు ఏ విద్యార్థి ఇంట చూసిన సంతోషం కనిపిస్తోందని ఏ తల్లిని అడిగినా ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రూ.1.70కోట్లతో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో, రూ.2.50 కోట్లతో కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు.అంతేకాకుండా ప్రతి విద్యా సంస్థలకు సోలార్ ఏర్పాటు చేశారని వేడినీరుఅందుతోందన్నారు. మరోవైపు పాఠశాలల్లో దొడ్డు బియ్యం స్థానంలో నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇన్ని మంచి కార్యక్రమాలు చేసినప్పుడు విద్యార్థులు కూడా క్రమశిక్షణగా చదువుకొని ఉన్నత స్థానానికి వెళ్లాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## జిఎంఆర్ బలిజ కులస్తుల ఉచిత పరిచయ వేదికకు అపూర్వ స్పందన

- రిజిస్ట్రేషన్లు చేయించుకున్న 150 మంది



రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, జూలై 26 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన జిఎంఆర్ బలిజ కులస్తుల ఉచిత పరిచయ వేదికకు అపూర్వ స్పందన లభించినట్లు తాడిపత్రి బలిజ సంఘం అధ్యక్షులు మాసూల్ ప్రసాద్ పేర్కొన్నారు. తాడిపత్రి బలిజ సంఘం ఆధ్వర్యంలో జిఎంఆర్ బలిజ కులస్తుల ఉచిత పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తాడిపత్రి నుండే కాకుండా యాడికి, రాయలచెరువు, గుత్తి గుంతకల్లు, నార్పల, కడప జిల్లా నుండి పెద్దఎత్తున వధువు, వరుడు కావాల్సిన వారు తరలివచ్చారు. వారు తమ బయోడేటాలను వివాహ పరిచయ వేదిక సభ్యులకు అందజేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జిఎంఆర్ బలిజ కులస్తుల ఉచిత వివాహ పరిచయ వేదిక ఫౌండర్ వెంకటరమణను తాడిపత్రి బలిజ సంఘం అధ్యక్షుడు మాసూల్ ప్రసాద్, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. తాడిపత్రి బలిజ సంఘం



ఉచిత వివాహ పరిచయ వేదిక ఫౌండర్ వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామని కొనియాడారు. ఈ వివాహ వేదికకు హాజరైన వారికి ఉదయం అల్పాహారం మధ్యాహ్నం విందును ఏర్పాటు చేశారు. దాదాపు 150 మంది వివాహ వేదికలో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ బలిజ కులస్తుల వ్యవస్థాపకులు వెంకటరమణ, బలిజ సంఘం గౌరవ సలహాదారుడు మాదాసు పెద్దమల్లేసు, విజయ బార్ బాబు, ఆకుల మల్లికార్జున, ఉపాధ్యక్షులు కోటపోతుల ప్రసాదు, మాదాసు మల్లేష్, చల్లా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి చిక్యాల సుబ్రహ్మణ్యం, కోశాధికారి కూనిశెట్టి విశ్వనాథ్, ఆలయ కమిటీ అధ్యక్షులు పగడాల జయకృష్ణ, జాయింట్ సెక్రెటరీ గాదంశెట్టి ప్రసాదు, కార్యవర్గసభ్యులు జింక శేఖర్, వెళ్ళబోయిన శ్రీనివాసులు, గాజుల పుల్లయ్య, చింతమాను వెంకటనారాయణ, పృథ్విపతి రమేష్, ఆకుల శ్రీకాంత్, కృష్ణరంగయ్య, జక్క రఘురామయ్య, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

- నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక,
- రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ పి ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ జులై 26 ప్రభాతవార్త



మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100 అనే బ్యానర్ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలా స్వామికి సన్మానం

- పార్టీలకు అతీతంగా తరలివచ్చిన ప్రజలు, మహిళలు



నీలా స్వామిని సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం జూలై 26 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ కురుబ సంఘం యువజన ఉపాధ్యక్షుడిగా స్టేట్ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్గా ఎంపికైన నీలాస్వామి ని గుండిగానపల్లి గ్రామ ప్రజలు అత్యంత ఘనంగా సన్మానించారు. ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా, పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ ఏకమై ఈ అపూర్వ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా ఈ వేడుకకు భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చి నీలాస్వామిని ఆశీర్వదించడం విశేషం. ప్రజల ఆప్యాయతకు చలించిన నీలాస్వామి ఈ సన్మాన సభలో నీలాస్వామి మాట్లాడతూ గ్రామ ప్రజలకు, మహిళలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకు అతీతంగా, రాజకీయాలకు దూరంగా వచ్చి నన్ను ఘనంగా సన్మానించిన ప్రతి ఒక్క గ్రామస్థునికి, అక్కచెల్లెండ్లకు నా హృదయపూర్వక పాదాభివందనాలు తెలియజేసుకుంటున్నా నని అన్నారు అమిలినేని సురేంద్రబాబు నన్ను గుర్తించి స్టేట్ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించి, నాకు మరియు మన గుండిగానపల్లి గ్రామానికి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావడం జరిగింది. వారికి ఎప్పుడూ రుణపడి ఉంటాను." అభివృద్ధి మాత్రమే శాశ్వతం పదవులు శాశ్వతం కావు.. మనం ప్రజల కోసం, సమాజం కోసం చేసుకునే అభివృద్ధి మాత్రమే ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతుంది. గ్రామ ఐక్యత మనమందరం కలిసిమెలిసి, ఎలాంటి విభేదాలకు తావులేకుండా మన గుండిగానపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసుకుందాం. నీతి, నిజాయితీ ముఖ్యం అందరికీ కాలం వచ్చినప్పుడు పదవులు వస్తాయి, పోతాయి. కానీ మనం నీతి, నిజాయితీగా కష్టపడటాన్ని ఎప్పుడూ అలవాటు చేసుకోవాలి. పదవులు శాశ్వతం కావు.. మనం చేసే అభివృద్ధే శాశ్వతం అనే నీలా స్వామి ఆశయం గ్రామ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సన్మాన కార్యక్రమం గుండిగానపల్లిలో పండగ వాతావరణాన్ని తలపించింది.

## పాఠశాలల్లో పనిచేయని ఆర్వో వాటర్ ప్లాంట్లు...!

మొదటిపేజీ తరువాయి....

నీళ్లు కొనుగోలు చేస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోనే రాంనగర్ లో ఉన్న మదర్ థెరిస్సా నగరపాలక ప్రాథమిక పాఠశాల లలో కూడా ఆరో వాటర్ ప్లాంట్ ఉంది. కానీ కొన్ని నెలలుగా పని చేయడం లేదు. దీంతో టీచర్లు నీళ్లు కొనుగోలు చేస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని పాత ఊరులో ఎన్ వి ఆర్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో కూడా ఆర్వో వాటర్ ప్లాంట్ ఉంది. కానీ అక్కడ కూడా పనిచేయడం లేదు. టీచర్లు నీళ్లు కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మరి కొన్ని పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ లు ఉన్నా కూడా పనిచేయకపోవడంతో విద్యార్థులు బోరు నీళ్లు తాగుతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే.... ఇక నియోజకవర్గ, మండల కేంద్రాల్లో, దూర ప్రాంతంలో ఉన్న పాఠశాలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇతర మండలాల్లో కూడా చాలా పాఠశాలల్లో పని చేయడం లేదని ఆయా మండల విద్యాశాఖ అధికారులు సమగ్రశిక్ష అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. పట్టించుకోని ఉన్నతాధికారులు: ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన తర్వాత వాటికి ఏడు సంవత్సరాల పాటు వారంటీ ఉంటుంది. అప్పటివరకు చెడిపోతే సంబంధిత కంపెనీ వారు వచ్చి ఉచితంగా మరమ్మత్తులు చేయాలి. కానీ పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ లు పని చేయడం లేదని ఆయా పాఠశాల హెచ్ఎంలు మండల విద్యాశాఖ అధికారి, డివిజన్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్రశిక్ష అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. కానీ పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత సమగ్రశిక్ష , ఏపీఈడబ్ల్యూఐడిసి అధికారులదే. కానీ సమగ్రశిక్ష,ఏపీఈడబ్ల్యూఐడిసి అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ సమస్యను గాలికి వదిలేశారు. మరోపక్క ఆర్వో వాటర్ ప్లాంట్ సరఫరా చేసిన కంపెనీ ప్రతినిధులు పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. ఇలా వందలాది పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు పనిచేయకపోయినప్పటికీ దాదాపు అన్ని పని చేస్తున్నాయని జిల్లా సమగ్రశిక్ష అధికారులు జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్లు పనిచేస్తున్నాయా? లేదా? అని విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులతో కాకుండా రెవెన్యూ శాఖ అధికారులతో విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అయితే దీనిపైన ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే. చాలాచోట్ల పనిచేయలేదన్న మాట వాస్తవమే: ఇంచార్జ్ డీఈఓ శ్రీనివాసరావు జిల్లాలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి త్రాగునీరు అందించడానికి ప్రభుత్వము లక్షలాది రూపాయలు విలువచేసే ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. అయితే చాలా పాఠశాలల్లో అవి కొన్ని నెలలు మాత్రమే పనిచేసే తర్వాత పని చేయడం లేదని మా దృష్టికి వచ్చింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

# తాడిపత్రిలో స్వల్ప ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు
- మాజీ కౌన్సిలర్ మల్లికార్జునను పరామర్శించేందుకు బయలుదేరిన జె.సి ప్రభాకర్రెడ్డి
- పెద్దారెడ్డి ఇంటి వైపు నుంచి మల్లికార్జున ఇంటికి బయలుదేరిన జె.సి ప్రభాకర్రెడ్డి, టిడిపి శ్రేణులు
- పోలీసుల సమన్వయంతో తొలగిన ఉద్రిక్తత



ర్యాలీగా వెళుతున్న జె.సి ప్రభాకర్రెడ్డి

తాడిపత్రిఅర్బన్, జూలై 26 ప్రభాతవార్త

తాడిపత్రిలో మరో మారు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన నివాసంలో ఆదివారం కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో టిడిపి మాజీ కౌన్సిలర్ మల్లికార్జున కాలికి శాస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన సందర్భంగా జె.సి ప్రభాకర్రెడ్డి మల్లికార్జున ఇంటికి వెళ్లేందుకు టిడిపి శ్రేణులను తన ఇంటి వద్దకు రమ్మని పిలుపునిచ్చారు. మల్లికార్జున ఇంటి వద్దకు వెళ్లడానికి పెద్దారెడ్డి ఇంటి సమీపం నుంచే వెళ్లే రహదారి ఉండడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సిఐలు నారాయణరెడ్డి, ఆరోహణరావు ఇద్దరు ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ జె.సి ప్రభాకర్రెడ్డితో పలుమార్లు చర్చలు జరిపారు. ఒకే సమయంలో ఇరువురు ఎదురుపడితే పెద్ద ఘర్షణ తలెత్తే అవకాశం ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి నియోజకవర్గంలోని పోలీస్ సిబ్బందిని తాడిపత్రికి రప్పించి పెద్దారెడ్డి ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దారెడ్డితో మాట్లాడి కార్యకర్తల సమావేశాన్ని త్వరగా ముగించే విధంగా ఒప్పించారు. అంతకుముందు జె.సి ప్రభాకర్రెడ్డి ఇంటి వద్దకు టిడిపి నాయకులు,



సిఐలతో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్రెడ్డి

కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకోవడంతో ఉత్కంఠ నెలకొంది. పెద్దారెడ్డి పోలీసుల సూచనల మేరకు సమావేశాన్ని త్వరగా ముగించి నాయకులను తన ఇంటి వద్ద నుంచి వెళ్ళమని చెప్పారు. అనంతరం జె.సి ప్రభాకర్రెడ్డి తన ఇంటి వద్ద నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలతో పెద్దఎత్తున ర్యాలీగా పెద్దారెడ్డి ఇంటి వద్ద నుంచి మాజీ కౌన్సిలర్ మల్లికార్జున ఇంటి వద్దకు వెళ్లేటప్పుడు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అక్కడ బందోబస్తులో ఉన్న సిఐలు నారాయణరెడ్డి, ఆరోహణరావులను పిలిచి కోర్టు ఆదేశాలను మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పాటించడం లేదని అక్కడ వాహనాలు అధిక సంఖ్యలో ఉన్నాయని వాటిని తొలగించాలని పేర్కొన్నారు. తాము పెద్దారెడ్డితో మాట్లాడి ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఉండకుండా చూస్తామని చెప్పడంతో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ కౌన్సిలర్ మల్లికార్జున ఇంటికి వెళ్లి మల్లికార్జునను తన కుమారుడు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్రెడ్డితో కలిసి పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పోలీసులు ఇరువర్గాల నాయకులను సమన్వయం చేసుకోవడంతో వారు ఒకేసారి కలుసుకోకుండా చేయడంలో సఫలీకృతులయ్యారు. దీంతో తాడిపత్రిలో మరొకసారి నెలకొన్న ఉద్రిక్తత తొలగిపోయింది.